
సాక్షి
తూర్పుగోదావరి
శుక్రవారం । 3 । మే । 2024



రూ.50 వేల విరాళం

గోకవరం: గ్రామంలోని స్కంద బాలాజీ సూర్య దేవాలయానికి అయ్యల చిన్నయ్య తన శిష్యుడు తోట త్రిమూర్తులు ద్వారా రూ.50 వేల విరాళం అందజేశారు.



4,350 క్యూసెక్కుల విడుదల

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గురువారం తూర్పు డెల్టాకు 200, మధ్య డెల్టాకు 800, పశ్చిమ డెల్టాకు 3,350 క్యూసెక్కుల చొప్పున గోదావరి నీటిని విడుదల చేశారు.

గరిష్టం/కనిష్టం
48.0°/26.0°

	గరిష్టం	కనిష్టం
రాజమహేంద్రవరం	48.0	28.0
కాకినాడ	39.1	28.5
అమలాపురం	39.0	26.0

న్యూస్‌రీల్

ఎంపీ అభ్యర్థుల ఖర్చుల తొలి ఆడిట్

సీటీఆర్‌ఐ (రాజమహేంద్రవరం): ఎంపీ అభ్యర్థుల ఎన్నికల ఖర్చులపై తొలి ఆడిట్ నిర్వహించామని రాజమండ్రి లోక్‌సభ నియోజకవర్గ ఎన్నికల వ్యయ పరిశీలకుడు జై అరవింద్ తెలిపారు. ఎంపీ అభ్యర్థుల తరఫున వారి ప్రతినిధులు గురువారం హాజరై ఖర్చుల వివరాలు ఆడిటింగ్ చేసుకున్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన ఈ కార్యక్రమంలో జై అరవింద్ మాట్లాడుతూ, క్షేత్ర స్థాయిలో వివిధ సర్వైలెన్స్ బృందాల ద్వారా అభ్యర్థుల ఖర్చులపై నిఘా పెట్టామని చెప్పారు. ఈ ఖర్చులను ఎన్నికల విధుల్లో ఉండే అకౌంటింగ్ బృందం షాడో రిజిస్టర్‌లో నమోదు చేస్తోందని తెలిపారు. ఆ వివరాలను నామినేషన్ల దాఖలు సమయంలో అభ్యర్థులు అందజేసిన వ్యయ రిజిస్టర్‌లో కూడా నమోదు చేయాల్సి ఉంటుందన్నారు. ఈ రెండు రిజిస్టర్లను ఆడిటింగ్ చేసి, అభ్యర్థుల ఎన్నికల ఖర్చు కింద చూపుతారని అరవింద్ తెలిపారు. వీటి ఆధారంగా ఆయా ఖర్చులను హేతుబద్ధంగా నిర్ధారించాల్సిన బాధ్యత ఆయా అభ్యర్థులదేనని స్పష్టం చేశారు. కార్యక్రమంలో జిల్లా ఆడిటింగ్ నోడల్ అధికారి వెంకటేశ్వరరావు, 12 మంది అభ్యర్థుల ఆడిటింగ్ బృందం సభ్యులు పాల్గొన్నారు.

ఇంటి వద్దకే పింఛన్ల పంపిణీ 92.93 శాతం

రాజమహేంద్రవరం రూరల్: జిల్లావ్యాప్తంగా రెండో రోజైన గురువారం మంచం పట్టిన రోగులు, దివ్యాంగులు, అమర జవాన్ల కుటుంబ సభ్యులకు ఇంటి వద్దనే పింఛన్ల పంపిణీ 92.93 శాతం పూర్తి చేశారు. డీబీటీ ద్వారా ఆధార్‌కు అనుసంధానమైన లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో 96.85 శాతం జమ చేశారు. డీఆర్‌డీఏ యానిమేటర్ల సహకారంతో బ్యాంకుల వద్ద, బ్యాంక్ కలెక్షన్ పాయింట్ల ద్వారా పింఛన్‌దారులకు నగదు పంపిణీ చేశారు. రాత్రి 8 గంటల వరకూ జిల్లాలోని 64,991 మంది బెడ్ రిడెన్ పేషెంట్లు, దివ్యాంగులకు, 60,396 మంది అమర జవాన్ల కుటుంబ సభ్యులకు వారి ఇంటి వద్దనే సచివాలయ ఉద్యోగులు పింఛన్లు పంపిణీ చేశారు. డీబీటీ ద్వారా ఆధార్ అనుసంధానమైన బ్యాంకు ఖాతాల లబ్ధిదారులు 1,78,093 మందికి గాను 1,72,482 మందికి మాత్రమే జమ చేశారు. మిగిలిన 5,611 మందికి బ్యాంకు ఖాతాలో డబ్బులు పడలేదు.

పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకోవాలి

కాకినాడ సిటీ: జిల్లాలో ఎన్నికల విధుల్లో పాల్గొంటున్న ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్ జారీ చేశామని జిల్లా పోస్టల్ బ్యాలెట్ నోడల్ అధికారి, జిల్లా ఉపాధి, శిక్షణ అధికారి శ్రీనివాస్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ముందుగా నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం ఏర్పాటు చేసిన కేంద్రాల్లో పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకోవాలని ఆయా ఉద్యోగులకు సూచించారు. ఇప్పటికే నిర్వహించిన శిక్షణ కార్యక్రమాల్లో పోలింగ్ సిబ్బంది, పీఓ, ఏపీఓ, ఓపీఓ, డ్రైవర్లు, పోలీస్ సిబ్బంది, వీడియోగ్రాఫర్లు, ఇతర సిబ్బంది ఫారం 12, 12డి ద్వారా పోస్టల్ బ్యాలెట్‌కు దరఖాస్తు చేసుకున్నారన్నారు. జిల్లాలో ఎన్నికల విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి ఈ నెల 4, 5, 6 తేదీల్లో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఫెసిలిటేషన్ సెంటర్లు ఏర్పాటు చేశామని తెలిపారు. ఇక్కడ పని చేస్తూ, వేరే జిల్లాలో ఓటు హక్కు కలిగిన సిబ్బందికి ఈ నెల 7, 8 తేదీల్లో కాకినాడ ప్రభుత్వ పీఆర్ డిగ్రీ కళాశాలలో ప్రత్యేకంగా ఫెసిలిటేషన్ సెంటర్ ఏర్పాటు చేశామని వివరించారు. పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్‌ను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని శ్రీనివాస్ కోరారు.

పండుటాకుల మండిపాటు

- వలంటీర్ల ద్వారా పింఛన్ల పంపిణీని అడ్డుకున్న 'పచ్చ' బ్యాచ్
- పింఛన్ల కోసం బ్యాంకుల చుట్టూ ప్రదక్షిణలు చేయలేక లబ్ధిదారుల అవస్థలు
- చంద్రబాబు అండ్ కోపై ఆగ్రహం
- నాటి అవస్థలను గుర్తు చేసుకుంటూ ఆవేదన
- అందరికీ ఇళ్ల వద్దనే పంపిణీ చేయాలని డిమాండ్



తలసీమియాతో హైదరాబాద్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఉర్ల అభినవ్ శ్యామ్‌కు, ఆయన తల్లి నాగలక్ష్మికి వితంతు పింఛను కలిపి రూ.13 వేలు అందిస్తున్న వలంటీర్ ఈతకోట ఉదయ్ కిరణ్ (ఫైల్)

కొవ్వూరు: చంద్రబాబు అండ్ కో పుణ్యమా అని అవ్వాతాతలు, దివ్యాంగులు, రకరకాల వ్యాధులతో మంచం పట్టిన వారికి రెండు నెలలుగా పింఛన్లు నేరుగా చేతికి అందని దుస్థితి నెలకొంది. గత నెలలో లబ్ధిదారులు పింఛను సొమ్ముల కోసం మండుటెండలో సచివాలయాల వద్దకు పరుగులు తీసి.. నానా అవస్థలూ పడ్డారు. కొంతమంది ప్రాణాలు కోల్పోయారు. ఈ నేపథ్యంలో ఈసారి నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో పింఛను సొమ్ములు జమ చేయాలని, దీర్ఘకాలిక రోగాలతో బాధ పడుతున్న వారికి, మంచం పట్టిన వారికి, మాజీ సైనికుల కుటుంబ సభ్యులకు ఇళ్ల వద్దనే సచివాలయ ఉద్యోగుల ద్వారా పంపిణీ చేయాలని ఎన్నికల కమిషన్ ఆదేశించింది. వచ్చే నెల కూడా ఇదే విధంగా పింఛన్లు పంపిణీ చేయాలని ఇప్పటికే ఆదేశాలు జారీ చేసింది. ఈ నెలలో పింఛన్లు అందని అభాగ్యులు ఆ సొమ్ము తమ బ్యాంకు ఖాతాల్లో జమయ్యిందేమో చూసుకోవడానికి ఇప్పుడు బ్యాంకుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. రెండు నెలల కిందటి వరకూ నేరుగా చేతికి పింఛన్లు అందడాన్ని గుర్తుకు తెచ్చుకుంటూ.. ఇప్పుడు తమకు ఈ కష్టాలు తీసుకువచ్చిన వారిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నోటికందే కూడును లాగేసుకున్నట్టు.. ఇదే రాజకీయమంటూ మండిపడుతున్నారు. గతంలో మాదిరిగా వలంటీర్ల ద్వారా అందరికీ నేరుగా ఇంటి వద్దనే పింఛన్ల సొమ్ము అందించాలని డిమాండ్ చేస్తున్నారు.

ఐదేళ్ల కిందట పండుటాకులకు నరకమే..

ఐదేళ్ల కిందట నాటి టీడీపీ ప్రభుత్వ హయాంలో పింఛన్ల కోసం లబ్ధిదారులు పడరాని పాట్లు పడేవారు. వృద్ధులు, దివ్యాంగులు, నడవలేని స్థితిలో ఉన్న వారందరూ వారికి ప్రభుత్వం ఇచ్చే కొద్దిపాటి పింఛను సొమ్ము కోసం పంచాయతీ కార్యాలయాల చుట్టూ రోజుల తరబడి కాళ్లరిగేలా తిరిగేవారు. వేలి ముద్రలు పడటం లేదని, బయోమెట్రిక్ యంత్రాలు సక్రమంగా పని చేయడం లేదని, ఇంకా పింఛను సొమ్ములు అందలేదని పదేపదే తిప్పించుకునే దారుణమైన పరిస్థితులు ఉండేవి. టీడీపీ ప్రభుత్వ హయాంలో మొదట్లో పింఛను కేవలం రూ.75 ఉండేది. ఈ మొత్తాన్ని నాటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి రూ.200కు పెంచారు. ఆయన హఠాన్మరణాంతరం ప్రభుత్వ పగ్గాలు చేపట్టిన నాటి కాంగ్రెస్ ముఖ్యమంత్రి కె.రోశయ్య పాలనలో పింఛన్లు జమ చేసేందుకు బ్యాంకు ఖాతాలు తెరవాలని షరతు పెట్టారు. దీంతో బ్యాంకు ఖాతాల కోసం అప్పట్లో పింఛనుదార్లు పడరాని పాట్లు పడ్డారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మొదట్లో రూ.వెయ్యి చొప్పున పింఛను అందించేది. 2019 ఎన్నికలు సమీపించడానికి ఆరు నెలల ముందు ఈ మొత్తాన్ని రూ.2 వేలకు పెంచారు. అది కూడా ప్రజా సంకల్ప పాదయాత్రలో నాటి విపక్ష నేత, నేటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పింఛను మొత్తాన్ని రూ.3 వేలకు పెంచుతామని ప్రకటించిన తర్వాతే చంద్రబాబు పింఛను పెంచారు. ఆ మొత్తం అందుకోవడానికి కూడా అప్పట్లో వృద్ధులు, దివ్యాంగులు తదితర లబ్ధిదారులు నానా ఇక్కట్లు పడేవారు.

ఐదేళ్లుగా ఇంటివద్దనే పింఛన్లు

తాను అధికారంలోకి వస్తే దశల వారీగా పింఛను మొత్తాన్ని రూ.3 వేలకు పెంచుతానని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాడు పాదయాత్రలో ప్రకటించారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తరువాత ఆ మాటను తు.చ. తప్పకుండా అమలు చేశారు. నాలుగు విడతల్లో పింఛను మొత్తాన్ని రూ.3 వేలకు పెంచారు. అర్హతే ప్రామాణికంగా కొత్తవారిని ఎంపిక చేయడంతో లబ్ధిదారుల సంఖ్య గతం కంటే దాదాపు రెట్టింపైంది. ప్రస్తుతం జిల్లావ్యాప్తంగా ప్రతి నెలా 2,43,084 మందికి రూ.72,16,46,000 మేర ప్రభుత్వం వివిధ రకాల పింఛన్లు అందిస్తోంది.

అంతే కాదు.. 2019 ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పింఛన్లతో పాటు వివిధ సంక్షేమ పథకాలను అర్హులైన ప్రజలకు అందించేందుకు గ్రామ/వార్డు సచివాలయాలు, గ్రామ/వార్డు వలంటీర్ వ్యవస్థలకు శ్రీకారం చుట్టింది. జిల్లావ్యాప్తంగా 4,95,020 ఇళ్లకు సంబంధించి 512 గ్రామ, వార్డు సచివాలయాలు ఏర్పాటు చేసింది. 271 గ్రామాల్లో 393 గ్రామ సచివాలయాలు, పట్టణ ప్రాంతాల్లో 119 వార్డు సచివాలయాలు ఏర్పాటయ్యాయి. ఈ సచివాలయాల పరిధిలో ప్రస్తుతం 8,927 మంది వలంటీర్లు తమ సేవలందిస్తున్నారు. ఈ వలంటీర్ వ్యవస్థతో లబ్ధిదారులకు పింఛను కష్టాలు తప్పాయి. పండగైనా, సెలవు రోజైనా ప్రతి నెలా ఒకటో తేదీ తెల్లవారక ముందే లబ్ధిదారుల ఇళ్ల తలుపులు తట్టి మరీ వలంటీర్లు పింఛను సొమ్ములు నేరుగా చేతిలో పెట్టేవారు. ఎక్కడైనా, ఎవరైనా అనారోగ్య సమస్యలతో ఆసుపత్రిలో ఉంటే అక్కడికి వెళ్లి సైతం వలంటీర్లు పింఛన్లు అందించేవారు. వీరి సేవలతో వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి మంచి పేరు వస్తోందనే దుగ్ధతో చంద్రబాబు అండ్ కో ఎన్నికల కమిషన్‌ను అడ్డం పెట్టుకుని వలంటీర్ల ద్వారా పింఛన్ల పంపిణీని కుట్ర పూరితంగా అడ్డుకుంది. ఫలితంగా రెండు నెలలుగా పింఛనుదార్లకు గత టీడీపీ ప్రభుత్వ హయాంలో పడిన కష్టాలు పునరావృతమవుతున్నాయి. దీనిపై లబ్ధిదారులు మండిపడుతున్నారు. 'పచ్చ' బ్యాచ్‌కు శాపనార్థాలు పెడుతున్నారు. నాటి టీడీపీ పాలనలోని కష్టాలను ఆ పార్టీ పునరావృతం చేసిందని ఆవేదన చెందుతున్నారు.

ఈ ఐదేళ్లూ బాధ తెలియలేదు



ప్రతి నెలా ఒకటో తేదీనే వలంటీర్లు ఇంటికి వచ్చి పింఛన్లు ఇస్తుండేవారు. ఈ ఐదేళ్లూ ఎలాంటి బాధా తెలియకుండా సొమ్ము అందింది. ఎలాంటి ఆందోళనా, ఇబ్బందీ రాలేదు. గత నెల సచివాలయంలో ఇస్తామని, ఇప్పుడేమో బ్యాంకులో వేశామని అంటున్నారు. ఎక్కడికి వెళ్లాలో తెలియడం లేదు. వలంటీర్లు వచ్చి సేవలు అందిస్తేనే బాగుంది. రాజకీయాలు చేసి మాలాంటి వృద్ధులకు అన్యాయం చేయవద్దు.

\- వర్రి అప్పాయ్యమ్మ, పింఛనుదారు, పందలపాక, బిక్కవోలు మండలం



2011 మార్చి 10: నాటి కాంగ్రెస్ పాలనలో పింఛన్ల కోసం కొవ్వూరు మునిసిపల్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న లబ్ధిదారులు



2016 మే 7: టీడీపీ పాలనలో చాగల్లు పంచాయతీ కార్యాలయం వద్ద పింఛన్ల కోసం పడిగాపులు పడుతున్న వృద్ధులు, లబ్ధిదారులు

ఓపెన్ టెన్త్, ఇంటర్‌లో ఖైదీల ప్రతిభ

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): ఇటీవల విడుదలైన ఓపెన్ టెన్త్, ఇంటర్ పరీక్షల ఫలితాల్లో రాజమహేంద్రవరం సెంట్రల్ జైలు ఖైదీలు అత్యుత్తమ ఫలితాలు సాధించారని సూపరింటెండెంట్ ఎస్.రాహుల్ తెలిపారు. అత్యధిక మార్కులు సాధించిన ఖైదీలు సురేష్ కుమార్, మాణిక్యంతో పాటు ఇతర ఖైదీలను ఆయన గురువారం సత్కరించారు. ఈ సందర్భంగా రాహుల్ మాట్లాడుతూ, సెంట్రల్ జైలు నుంచి తొలిసారి 48 మంది ఖైదీలు ఓపెన్ టెన్త్ పరీక్షలకు హాజరవగా, వారిలో 39 మంది పాసై, 81 శాతం ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. అలాగే ఓపెన్ ఇంటర్ పరీక్షలు 12 మంది రాయగా, 11 మంది పాసై 92 శాతం ఉత్తీర్ణత సాధించారని చెప్పారు. రెండు విభాగాల్లో 90 శాతం మంది ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులవడం విశేషమన్నారు. గత ఏడాది డిగ్రీ పరీక్షల్లో సెంట్రల్ జైలు ఖైదీ ఒకరు రెండు బంగారు పతకాలు సాధించి, జాతీయ స్థాయిలో పేరు తీసుకుని వచ్చారన్నారు. జైలులో ఖైదీల సంక్షేమానికి కృషి చేస్తున్న డిప్యూటీ సూపరింటెండెంట్ ఎం.రాజ్‌కుమార్‌ను, వారు చదువులను ప్రోత్సహిస్తున్న జైలర్ శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు చిలుకూరి శ్రీనివాసరావు, ఎంప శర్మ, వార్డర్ శంకరరావులను రాహుల్ అభినందించారు. కార్యక్రమంలో జైలు సంక్షేమ అధికారి శ్రీనివాసరావు, జైలర్లు సీహెచ్ రమేష్, రామారావు తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీలకు జగన్ ప్రభుత్వంలోనే మేలు

- ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు
- ఆత్మీయ సమ్మేళనానికి భారీగా తరలివచ్చిన ముస్లింలు



ఆత్మీయ సమ్మేళనంలో సంఘీభావం తెలుపుతున్న ముస్లిం మైనార్టీ నాయకులు, ఎమ్మెల్యే అభ్యర్థి శ్రీనివాస్‌నాయుడు

నిడదవోలు: ముస్లిం మైనార్టీలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలోనే మేలు జరిగిందని వైఎస్సార్ సీపీ నిడదవోలు ఎమ్మెల్యే, ప్రస్తుత అభ్యర్థి జి.శ్రీనివాస్‌నాయుడు అన్నారు. స్థానిక కాపు కల్యాణ మండపంలో గురువారం జరిగిన నియోజకవర్గ స్థాయి ముస్లింల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ముస్లింలకు కల్పించిన 4 శాతం రిజర్వేషన్లను తొలగించేందుకు బీజేపీ కుట్ర చేస్తున్నా.. టీడీపీ, జనసేన పార్టీలు మాట్లాడకపోవడం సిగ్గుచేటన్నారు. ముస్లింలను టీడీపీ కేవలం ఓటు బ్యాంకు రాజకీయాలకే వాడుకుంటోందన్నారు. ముస్లింలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి డిప్యూటీ సీఎంతో పాటు మేయర్, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ తదితర పదవులు కేటాయించారని గుర్తు చేశారు. ఈ ఎన్నికల్లో ముస్లింలకు ఏడు టిక్కెట్లు కేటాయించి, వారిపై ప్రేమను చాటుకున్నారన్నారు. ముస్లింలందరూ 2009 నుంచి జగన్ వెంటే ఉన్నారని, అర్చకులు, పాస్టర్లు, ఇమామ్‌లకు ఏటా ఆర్థిక సాయం అందించడం అనేది రాష్ట్ర చరిత్రలో ఎప్పుడూ జరగలేదని చెప్పారు. నిడదవోలు మున్సిపాలిటీలో సైతం ముస్లిం మహిళలకు కౌన్సిలర్ పదవులు ఇచ్చామన్నారు. నియోజకవర్గంలో మసీదులు, షాదీఖానాల అభివృద్ధికి రూ.1.50 కోట్లు ఇచ్చామని, అర్హులైన ముస్లింలకు ఇళ్ల స్థలాలు కేటాయించామని చెప్పారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి 2014 నుంచి అధికారంలో ఉన్నప్పుడు ముస్లింలకు ఏం చేసిందని ప్రశ్నించారు. నాలుగు శాతం రిజర్వేషన్లతో ముస్లిం యువత ఉన్నత చదువులు చదువుకుని ఉద్యోగాలు చేస్తున్నారని చెప్పారు. 30 ఏళ్ల రాజకీయ జీవితంలో ఎటువంటి అవినీతి మరకా లేకుండా నియోజవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేశానని, మళ్లీ అధికారమిస్తే మరింత అభివృద్ధి చేసి చూపిస్తానని అన్నారు. రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై రెండు ఓట్లు వేసి, ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా డాక్టర్ గూడూరి శ్రీనివాస్‌ను గెలిపించాలని శ్రీనివాస్‌నాయుడు కోరారు.

జిల్లా వక్ఫ్‌బోర్డు అధ్యక్షుడు మొహమ్మద్ ఆరిఫ్ మాట్లాడుతూ, మతతత్వ బీజేపీతో జత కట్టి ముస్లింల ప్రయోజనాలకు భంగం కలిగిస్తున్న టీడీపీ, జనసేన కూటమి అభ్యర్థులను చిత్తుగా ఓడించాలని ముస్లింలకు పిలుపునిచ్చారు. మైనారిటీల ప్రయోజనాల పట్ల ఎటువంటి శ్రద్ధా లేని దుర్మార్గుడు చంద్రబాబు అని, ఆయనతో పాటు ఆయనను ముఖ్యమంత్రిని చేసేందుకు ఊగిపోతున్న దత్తపుత్రుడికి కూడా ఓట్లు రాలవని చెప్పారు. ముస్లింలకు వైఎస్సార్ ఇచ్చిన 4 శాతం రిజర్వేషన్లు రద్దు చేస్తామని బీజేపీ నాయకులు పదేపదే ప్రకటిస్తున్నా.. చంద్రబాబు, పవన్ కల్యాణ్ ఖండించకపోవడం మైనార్టీల ప్రయోజనాలపై వారికి ఉన్న చిన్నచూపునకు నిదర్శనమని అన్నారు. కూటమికి సమాధి కట్టాలని పిలుపునిచ్చారు. హజ్ యాత్రకు సీఎం జగన్ అదనంగా రూ.15 కోట్లు ఖర్చు చేశారని ఆయన తెలిపారు.

మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఎస్‌కే వజీరుద్దీన్ మాట్లాడుతూ, ముస్లింల రిజర్వేషన్లను తొలగించే కుట్రను ప్రతి ఒక్కరూ తిప్పి కొట్టాలని కోరారు. దేశంలోని 20 కోట్ల మంది ముస్లింల పొట్ట కొట్టాలని బీజేపీ ప్రయత్నిస్తున్నా ఏపీ కూటమి నాయకులు మాత్రం నోరు మెదపడం లేదని దుయ్యబట్టారు. దేశంలోనే ముస్లింలకు అత్యధిక ప్రయోజనాలు చేకూర్చిన ముఖ్యమంత్రిగా జగన్ చరిత్రలో శాశ్వతంగా నిలిచిపోతారని అన్నారు. రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ డైరెక్టర్ ఎస్‌కే నిజాముద్దీన్ మాట్లాడుతూ, వైఎస్సార్ సీపీ ఓట్లను చీల్చేందుకు కాంగ్రెస్ ప్రయత్నిస్తోందని, ఆ పార్టీకి ఓటు వేస్తే బీజేపీకి వేసినట్లేనని పేర్కొన్నారు. ముస్లింల సంక్షేమం, విద్య, ఉద్యోగ, ఉపాధి రంగాల్లో మేలు చేస్తున్న జగన్‌ను మరోసారి సీఎంగా గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జేసీఎస్ కన్వీనర్ ఎస్‌కే చాన్ బాషా, మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, మైనారిటీ సెల్ పట్టణ అధ్యక్షుడు మస్తాన్ వలీ, మైనార్టీ సెల్ జిల్లా ఉపాధ్యక్షులు అమీద్, సయ్యద్ బాబ్జీ, నిడదవోలు, ఉండ్రాజవరం మండలాల ముస్లిం సెల్ అధ్యక్షులు సయ్యద్ బాబ్జీ, షాజహాన్, కౌన్సిలర్లు ఎండీ షకీరాబేగం, అమ్మాదున్నీసా బేగం, ఎండీ ఆరిఫ్, సయ్యద్ వలీ, ఎస్‌కే రెహమాన్ తదితరులు పాల్గొన్నారు.

7న పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్

- ఫ్యూచర్ కిడ్స్ పాఠశాలలో నిర్వహణ
- ఉదయం 8 నుంచి అవకాశం
- కలెక్టర్ మాధవీలత



కలెక్టర్ మాధవీలత

సీటీఆర్‌ఐ (రాజమహేంద్రవరం): ఎన్నికల విధుల్లో పాల్గొంటున్న సిబ్బందికి, అనుబంధ కార్యకలాపాల్లో పాలు పంచుకుంటున్న వారికి ఈ నెల 7న పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేసే అవకాశం కల్పించామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కె.మాధవీలత తెలిపారు. ఆ రోజు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ రాజమహేంద్రవరం రూరల్ మండలం పిడింగొయ్యిలోని ఫ్యూచర్ కిడ్స్ ఉన్నత పాఠశాలలో పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ జరుగుతుందన్నారు. ఈ ప్రక్రియపై సంబంధిత నోడల్ అధికారులతో గురువారం తన చాంబర్‌లో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, పోలింగ్ రోజున ఎన్నికలు, ఇతర అత్యవసర విధుల్లో పాల్గొంటున్న 339 మంది సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్ అవకాశం కల్పించామన్నారు. వీరిలో జిల్లాలోని ఏడు నియోజకవర్గాలకు చెందిన వారు 217 మంది, ఇతర జిల్లాలకు చెందిన వారు 122 మంది ఉన్నారని వివరించారు. ఈ నెల 7వ తేదీన పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకునే వారికి ఆయా నోడల్ అధికారులు ముందుగానే లిఖితపూర్వకంగా సమాచారం అందించాలని సూచించారు. ఆ రోజు ఉదయం 7 గంటలకే నోడల్ అధికారులు పోస్టల్ ఓటింగ్ కేంద్రానికి హాజరు కావాలన్నారు. ఆ రోజు పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్‌కు హాజరు కాని ఉద్యోగులు వారి సొంత నియోజకవర్గంలోని సంబంధిత రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో ఈ నెల 8 , 9 తేదీల్లో ఈ సౌకర్యాన్ని వినియోగించుకోవచ్చని తెలిపారు. పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం వినియోగించుకోని ఉద్యోగులకు మే 13న జరిగే పోలింగ్‌లో ఓటు వేసే అవకాశం ఉండదని కలెక్టర్ స్పష్టం చేశారు. సమావేశం స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, పోస్టల్ బ్యాలెట్ నోడల్ అధికారి కె.కృష్ణనాయక్, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ ఎం.భానుప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

తొలి ఓటు పడింది

- హోమ్ ఓటింగ్‌కు శ్రీకారం
- ఏడు నియోజకవర్గాల్లో ప్రారంభం
- జిల్లాలో 1,383 మంది ఓటర్లు
- 85 ఏళ్లు నిండిన వారు 648 మంది
- దివ్యాంగులు 735 మంది

సీటీఆర్‌ఐ (రాజమహేంద్రవరం): ఈ నెల 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి జిల్లాలో గురువారం తొలి ఓటు పడింది. అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలనే లక్ష్యంతో ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు జిల్లా యంత్రాంగం హోం ఓటింగ్ ప్రక్రియకు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా రాజమహేంద్రవరం దానవాయిపేటకు చెందిన 85 ఏళ్లు నిండిన మహిళ తన ఓటు హక్కు వినియోగించుకుని, హోం ఓటింగ్ ప్రక్రియకు తెర లేపారు. ఈ ప్రక్రియను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కె.మాధవీలత, రాజమండ్రి సిటీ అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, నగరపాలక సంస్థ కమిషనర్ కె.దినేష్ కుమార్ నేరుగా పర్యవేక్షించారు. జిల్లాలో 85 ఏళ్లు నిండిన ఓటర్లు, దివ్యాంగులు ఇంటి వద్ద నుంచే తమ ఓటు వేసేందుకు ఫారం–12డి ద్వారా దరఖాస్తు చేసుకునేందుకు గతంలోనే అనుమతి ఇచ్చారు. జిల్లాలో 85 ఏళ్లు నిండిన ఓటర్లు 8,283 మంది, 40 శాతం పైబడిన వైకల్యం కలిగిన దివ్యాంగ ఓటర్లు 19,718 మంది ఉన్నారు. 85 ఏళ్లు నిండిన వారిలో 648 మంది, 735 మంది దివ్యాంగులు హోం ఓటింగ్‌కు ఆమోదం తెలిపారు. వీరితో ఓట్లు వేయించేందుకు 400 మంది ఉద్యోగులు, పోలీసులతో కూడిన 69 బృందాలు వారి ఇళ్లకు వెళ్లాయి. 85 ఏళ్లు దాటిన వారిలో 473 మంది, దివ్యాంగుల్లో 577 మంది తొలి రోజు హోం ఓటింగ్‌ను వినియోగించుకున్నారు. గురువారం హోం ఓటింగ్‌ను వినియోగించుకోలేకపోయిన వారికి ఈ నెల 8వ తేదీన చివరి అవకాశం ఇస్తారు. ఒకవేళ ఈ రెండు సందర్భాల్లోనూ ఓటు హక్కు వినియోగించుకోలేని వారు ఈ నెల 13న జరిగే పోలింగ్‌లో ఓటు వేసే అవకాశం కోల్పోతారు.

నియోజకవర్గాల వారీ వివరాలు

నియోజకవర్గం	85 ఏళ్లు పైబడిన వారు	దివ్యాంగులు
అనపర్తి	186	222
రాజానగరం	33	67
రాజమండ్రి సిటీ	142	65
రాజమండ్రి రూరల్	51	56
కొవ్వూరు	66	66
నిడదవోలు	130	145
గోపాలపురం	40	37



రాజమహేంద్రవరంలో కలెక్టర్ మాధవీలత, కమిషనర్ దినేష్ కుమార్ ఆధ్వర్యంలో హోం ఓటింగ్ వినియోగించుకున్న వృద్ధురాలు

పూర్తి గోప్యతతో..

హోం ఓటింగ్ ప్రక్రియను అత్యంత జాగ్రత్తగా, గోప్యతతో నిర్వహిస్తారు. ఓటింగ్ ప్రక్రియను వీడియో రికార్డింగ్ చేస్తారు. హోం ఓటింగ్ వినియోగించుకునే వారు లోక్‌సభకు ఒకటి, అసెంబ్లీకి ఒకటి చొప్పున ఓట్లను బ్యాలెట్ పేపర్‌లో వేయాలి. అనంతరం ఆ బ్యాలెట్ పేపర్‌ను సీల్ వేసి, బ్యాలెట్ బాక్స్‌లో జాగ్రత్తపరుస్తారు. ఎన్నికల కౌంటింగ్ రోజున అన్ని ఓట్లతో కలిపి వీటిని కూడా లెక్కిస్తారు.

హోం ఓటింగ్ వినియోగించుకున్న 104 ఏళ్ల వృద్ధుడు



నిడదవోలు: హోం ఓటింగ్‌లో భాగంగా నిడదవోలు పట్టణానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త, 104 ఏళ్ల రొంగల రాముడు తన ఇంటి వద్ద ఓటు వేశారు. సార్వత్రిక ఎన్నికల్లో తాను ఇప్పటి వరకూ 18 సార్లు ఓటు హక్కు వినియోగించుకున్నానని ఆయన చెప్పారు.

క్లుప్తంగా

తాటాకిల్లు దగ్ధం

రూ.5 లక్షల నష్టం



నబీపేటలో దగ్ధమైన తాటాకిల్లు

నల్లజర్ల: మండలంలోని నబీపేటలో గురువారం మధ్యాహ్నం 2గంటల సమయంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ఒక తాటాకిల్లు దగ్ధమైంది. మానికల సోమరాజు ట్రాక్టరు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. అతను పనికి వెళ్లిన సమయంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా నిప్పంటుకొని ఇంట్లో టీవీ, ఫ్రిజ్, మంచం, దుస్తులతో పాటు రూ.50 వేల నగదు కాలి బూడిదయ్యాయి. ఇరుగుపొరుగువారు వచ్చి మంటలను ఆర్పివేశారు. నష్టం విలువ రూ.5లక్షల వరకు ఉంటుందని సర్పంచ్ గోతం సత్యలక్ష్మి రెవెన్యూ అధికారులకు వివరించారు. ఇంటి యజమాని సోమరాజుతో పాటు భార్య, ఇద్దరు పిల్లలు కట్టుబట్టలతో మిగిలారు.

గుండెపోటుతో ఉపాధి కూలీ మృతి



సూరిశెట్టి రాజు మృతదేహం

అయినవిల్లి: మండలంలోని మడుపల్లి గ్రామానికి చెందిన ఉపాధి కూలీ గురువారం గ్రామంలో ఉపాధి పనులు చేస్తు గుండెపోటుకు గురై మృతి చెందాడు. దీనికి సంబంధించి గ్రామస్తులు, ఎన్ఆర్ఈజీఎస్ ఏపీఓ నాగబాబు తెలిపిన వివరాలు ప్రకారం... అయినవిల్లి మండలం మడుపల్లి గ్రామానికి చెందిన సూరిశెట్టి రాజు (54) అయినవిల్లి సొసైటీ డైరెక్టర్‌గా, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడిగాను ఉన్నారు. రాజు కుటుంబ పోషణ కోసం ఉపాధి పనులు చేసుకుంటున్నాడు. ఎప్పటిలాగే గ్రామంలో ఉపాధి పనుల కోసం గురువారం ఉదయమే వెళ్లాడు. గ్రామంలో ఉపాధి పనులు చేస్తూ గుండెపోటుకు గురై ఒక్కసారిగా కుప్పకూలి పడిపోయాడు. తోటి కూలీలు అతణ్ణి వైద్యం కోసం స్థానిక వైద్యులు దగ్గరకు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. అతని మృతదేహాన్ని పలువురు సదర్శించి నివాళులు అర్పించారు. మృతుడు రాజుకు భార్య లత, ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమారులు ఉన్నారు.

అన్నవరం.. అభివృద్ధి పథం


- ఐదేళ్లలో దేవస్థానంలో అనేక నిర్మాణాలు
- 54 వ్రత పురోహితుల పోస్టుల భర్తీ
- పురోహితుల పారితోషికం 30 నుంచి 40 శాతానికి పెరుగుదల
- కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ సిబ్బందికి రెట్టింపు జీతాలు
- సత్యదేవుని ఊరేగింపునకు రెండు టేకు రథాలు



అన్నవరం దేవస్థానం



కొండ దిగువన భక్తుల కోసం నిర్మించిన విశ్రాంతి షెడ్లు



ముత్యాల కవచాల అలంకరణలో సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవి, శంకరుడు

అన్నవరం: ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాకినాడ జిల్లా అన్నవరంలోని శ్రీ వీర వేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలో ఎన్నడూ జరగని అభివృద్ధి గత ఐదేళ్లలో జరిగింది. అటు ఆధ్యాత్మికపరంగా, ఇటు నిర్మాణాల పరంగా కూడా గతంలో ఎన్నడూ లేని విధంగా చరిత్రలో నిలిచిపోయే ఘటనలు చోటు చేసుకున్నాయి. దేవస్థానంలో ఐదేళ్లలో అనేక నిర్మాణాలు రూపుదిద్దుకున్నాయి. ఉద్యోగుల జీతాల పెంపుదల, వ్రత పురోహితుల ఉద్యోగాల భర్తీ, పారితోషికం పెంపుదల జరిగింది. అన్నింటికన్నా ముఖ్యమైనది మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మీ తోకలు కత్తిరిస్తామని ఆలయాలలో పనిచేసే నాయీ బ్రాహ్మణులను అవమానిస్తే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వారి పారితోషికం రూ.20 వేలకు పెంచి గౌరవించారు.

రూ.157 కోట్లకు చేరిన వార్షిక ఆదాయం

సత్యదేవుని వార్షికాదాయం 2023–24 ఆర్థిక సంవత్సరంలో రూ.157 కోట్లకు చేరింది. ఐదేళ్ల క్రితం ఈ ఆదాయం రూ.110 కోట్లు మాత్రమే. అంటే గత ఐదేళ్లలో దేవస్థానం ఆదాయం దాదాపుగా 50 శాతం పెరిగింది. ఆదాయంతో బాటు దేవస్థానంలో వసతులు కూడా పెరిగాయి.

అందుబాటులోకి శివసదన్ సత్రం

సత్యదేవుని ఆలయానికి విచ్చేసే భక్తుల సంఖ్య ఏటా పెరుగుతుండగా అందుకు తగినట్టుగా వసతి గదుల సత్రాల నిర్మాణం జరగలేదు. ఐతే సుమారు రూ.20 కోట్ల వ్యయంతో నిర్మాణం ప్రారంభించిన 135 గదుల శివసదన్ సత్రం పనులు గతంలో నత్తనడకన సాగాయి. రెండేళ్లుగా ఈ పనులు వేగవంతమై గత ఏడాది పూర్తయ్యాయి. ఫలితంగా 135 గదులు భక్తుల వసతికి అందుబాటులోకి వచ్చాయి.

ఉపయోగపడుతున్న ఆదిశంకర మార్గ్

వాహనాల రాకపోకలకు వీలుగా నిర్మించిన ఆదిశంకర మార్గ్, ప్రకాష్‌సదన్ పక్క నుంచి వేసిన ర్యాంపు రోడ్డు భక్తులకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. ఈ రెండింటి వల్లనే గత కార్తికమాసంలో లక్షలాది మంది భక్తులు విచ్చేసినా ఎక్కడ ట్రాఫిక్ జామ్ అవ్వలేదు.

కాలినడకన వచ్చే భక్తులకు అందుబాటులోకి డార్మెట్రీ...

దాత పెన్నాడ రాజామణి రూ.రెండు కోట్ల వ్యయంతో శ్రీవనదుర్గ ఆలయం వద్ద నిర్మించిన మూడు అంతస్తుల యాత్రికుల విశ్రాంతి భవనం (డార్మెట్రీ) కూడా గత ఏడాది కార్తికమాసంలోనే భక్తులకు అందుబాటులోకి వచ్చింది. మెట్ల దారి వెంట నడిచి వచ్చే భక్తుల కోసం నిర్మించినప్పటికీ వసతి గదులు లభ్యం కాని భక్తులకు ఇది ఎంతగానో ఉపయోగపడుతోంది. సుమారు 1,500 మంది భక్తులు ఈ సత్రంలో విశ్రాంతి తీసుకోవచ్చు.

ఆలయం నలుదిక్కులా దేవతా ప్రతి రూపాలు

క్షీర సాగర మథనంలో ఉద్భవించిన నాలుగు దేవతా ప్రతిరూపాలు గంధపుచెట్టు, (గంధపుగిన్నె) లక్ష్మీదేవి (లక్ష్మీ హుండీ), కల్పవృక్షం, కామధేనువు సత్యదేవుని ఆలయం నలుదిక్కులా ఏర్పాటు చేసి వాటిని దర్శిస్తూ ప్రదక్షిణ చేసేలా ఏర్పాటు చేశారు. ఈ ప్రదక్షిణ దర్శనం భక్తులకు చాలా సంతృప్తిని ఇవ్వడంతో బాటు ఆధ్మాత్మిక వాతావరణాన్ని ఇనుమడింప చేస్తోంది.

కొండ దిగువన భక్తుల విశ్రాంతి షెడ్లు

ఇవేకాకుండా కొండ దిగువన కళాశాల మైదానంలో నిర్మించిన భక్తుల విశ్రాంతి షెడ్లు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. టూరిస్టు బస్‌లలో వచ్చే భక్తులు ఈ షెడ్ల వద్ద తమ వాహనాలను నిలిపివేసి ఇక్కడే స్నానాలు చేసి, రత్నగిరికి వెళ్లి సత్యదేవుని దర్శనం చేసుకుంటున్నారు.

దేవస్థానం ఖ్యాతిని పెంచిన రెండు టేకు రథాలు

సత్యదేవుని ఊరేగింపునకు 50 సంవత్సరాల క్రితం చేయించిన వాహనాలు మినహా ఈ మధ్య కాలంలో ఎటువంటి వాహనాలు చేయించలేదు. సుమారు రూ.35 లక్షల వ్యయంతో చిన్న టేకు రథం, రూ.1.08 కోట్ల వ్యయంతో పెద్ద రథం ఈ ఏడాది అందుబాటులోకి వచ్చాయి. గత ఫిబ్రవరి నెలలో చిన్న రథం, ఏప్రిల్ 26వ తేదీన పెద్ద రథాన్ని ప్రారంభించారు. చిన్నరథంపై ప్రతీ ఆదివారం రత్నగిరిపై సత్యదేవుడిని ఊరేగిస్తున్నారు. ఈ నెల 18వ తేదీ నుంచి జరుగనున్న సత్యదేవుని దివ్యకల్యాణ మహోత్సవాలలో పెద్ద రథంపై స్వామివారిని ఊరేగించనున్నారు.

పెరిగిన సిబ్బంది జీత భత్యాలు

గతంలో దేవస్థానంలో కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల జీతభత్యాలు నెలకు రూ.పదివేల లోపు మాత్రమే ఉండేవి. వాటిని ఈ ప్రభుత్వం గణనీయంగా పెంచింది.

- 180 మంది కాంట్రాక్ట్ సిబ్బంది జీతాలు నెలకు రూ.13 వేల నుంచి రూ.22,500 వరకు పెరిగాయి.
- 40 మంది ఔట్‌సోర్సింగ్ సిబ్బంది జీతాలు నెలకు రూ.15 వేల నుంచి రూ.20 వేల వరకు పెరిగాయి.

40 శాతం పెరిగిన వ్రత పురోహితుల పారితోషికం

దేవస్థానంలో స్వామివారి వ్రతాలు నిర్వహించే 260 మంది వ్రత పురోహితుల పోస్టులలో 54 ఖాళీ ఉండగా 2021, 2023లో రెండు దఫాలుగా వాటిని భర్తీ చేశారు. వారికి వ్రతాల ఆదాయంలో గతంలో 30 శాతం మాత్రమే పారితోషికం చెల్లించేవారు. దానిని 2023లో 40 శాతానికి రాష్ట్ర ప్రభుత్వం పెంచింది. దీనివల్ల వారి పారితోషికం నెలకు రూ.పది వేలు పెరిగింది. గతంలో గ్రేడుల వారీగా నెలకు రూ.15 వేల నుంచి రూ.25 వేలు పారితోషికం వచ్చేది. ఇప్పుడు రూ.25 వేల నుంచి రూ.40 వేలు పారితోషికం వస్తోంది. దీనివల్ల 254 మంది లబ్ధి పొందారు.

నాయీ బ్రాహ్మణులకు రూ.20 వేల పారితోషికం

వివిధ దేవాలయాలలో క్షురకులుగా పనిచేస్తున్న నాయీ బ్రాహ్మణులు తమకు నెలకు వచ్చే పారితోషికం రూ. ఏడు వేలు మాత్రమేనని, దానిని పెంచాలని 2018లో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు వినతిపత్రం ఇవ్వడానికి వెళితే వారిపై ఆగ్రహం వ్యక్తం చేయడమే కాకుండా 'మీ తోకలు కత్తిరిస్తానని' వారిని అవమానించిన సంగతి తెలిసిందే. అపుడు పాదయాత్రలో ఉన్న జగన్‌మోహన్‌రెడ్డిని నాయీ బ్రాహ్మణులు కలిసి, తమ కష్టాలు చెప్పుకుంటే తమ ప్రభుత్వం వచ్చాక జీతం రూ.20 వేలకు పెంచుతానని హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చాక ఆ హామీ నిలబెట్టుకున్నారు. రత్నగిరిపై వివిధ ఆలయాలలో పనిచేసే 15 మంది పరిచారకుల పోస్టులను కూడా రెండేళ్ల క్రితం భర్తీ చేశారు. వీరికి నెలకు రూ.15 వేలు పారితోషికంగా చెల్లిస్తున్నారు.



సత్యదేవుని కొత్త టేకు రథం

జాతీయ రహదారిపై సత్యదేవుని నమూనా ఆలయం, ప్రసాదం విక్రయశాల

విశాఖపట్నం నుంచి విజయవాడ వైపు ప్రయాణించే రహదారిపై రూ.నాలుగు కోట్ల వ్యయంతో నిర్మించిన సత్యదేవుని నమూనా ఆలయం, స్వామివారి ప్రసాదం విక్రయాల దుకాణం గత నెలలో ప్రారంభమయ్యాయి. భక్తులు సత్యదేవుని ప్రసాదాల కొనుగోలుకు రోడ్డు దాటి విశాఖపట్నం వైపు వెళ్లే రోడ్డుపై గల ప్రసాదం దుకాణానికి రావల్సి వస్తోంది. దీనివలన ప్రమాదాలు జరుగుతుండడంతో విజయవాడ వైపు వెళ్లే రోడ్డు మీద స్వామివారి ఆలయం, ప్రసాదం విక్రయాలు, భక్తుల కోసం టాయిలెట్స్, క్యాంటీన్ కూడా నిర్మించారు. ఇవన్నీ ఒక ఎత్తు కాగా, ప్రతీ సోమవారం సత్యదేవునికి ముత్యాల కవచాలతో ముత్తంగి సేవ, ప్రతీ గురువారం స్వామి వారి నిజరూప దర్శనం కూడా భక్తులకు కనువిందు చేస్తున్నాయి.



జాతీయ రహదారిపై నిర్మించిన సత్యదేవుని నూతనాలయం

చోరీ అయిన 15 మోటారు సైకిళ్లు స్వాధీనం

- నిందితుడి అరెస్టు, కోర్టుకు తరలింపు
- పెద్దాపురం డీఎస్పీ లతాకుమారి



స్వాధీనం చేసుకున్న మోటారు సైకిళ్లతో డీఎస్పీ లతాకుమారి, క్రైమ్ సీఐలు, ఇబ్బంది

సామర్లకోట: వివిధ ప్రాంతాల్లో మోటారు సైకిళ్లను చోరీ చేస్తున్న నిందితుడిని అదుపులోనికి తీసుకొని అతని వద్ద నుంచి రూ.5.63 లక్షలు విలువ చేసే 15 మోటారు సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా గురువారం పెద్దాపురం డీఎస్పీ కె.లతాకుమారి స్థానిక క్రైమ్ స్టేషన్‌లో విలేకరులకు వివరాలు వెల్లడించారు. జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ ఆదేశాల మేరకు మోటారు సైకిళ్ల చోరీపై ప్రత్యేక నిఘా ఉంచామన్నారు. జగ్గంపేట సీఐ బి.లక్ష్మణరావు, కిర్లంపూడి ఎస్సై ఎస్‌కే జబీర్, సిబ్బంది కచ్చితమైన సమాచారంతో కొన్ని రోజులుగా కిర్లంపూడి, గండేపల్లి, సామర్లకోట, తూర్పుగోదావరి జిల్లా రాజానగరం, అనకాపల్లి జిల్లా అనకాపల్లి, చోడవరం పరిసర ప్రాంతాలల్లో వరుసగా ద్విచక్ర వాహనాలను చోరీ చేస్తున్న తూర్పుగోదావరి జిల్లా తాపేశ్వరం గ్రామానికి చెందిన బండారు మధుబాబు (26)ను కిర్లంపూడి గ్రామం దుర్గమ్మ గుడి వద్ద అదుపులోకి తీసుకొని విచారణ చేసి, అతని అధీనంలో ఉన్న 15 మోటారు సైకిళ్లను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. వీటి విలువ సుమారు రూ.5.63 లక్షలు ఉంటుందని డీఎస్పీ చెప్పారు. నిందితుడిని పట్టుకోవడంలోను, వాహనాలను రికవరీ చేయడంలోను ప్రత్యేక కృషి చేసిన పెద్దాపురం క్రైమ్ సీఐ ఆర్.అంకబాబు, క్రైం సిబ్బంది, జగ్గంపేట సీఐ బి.లక్ష్మణరావు, కిర్లంపూడి ఎస్సై ఎస్‌కే బజీర్‌లను డీఎస్పీ లతాకుమారి అభినందించారు.

ఆహార నాణ్యత పరీక్షలకు అగ్రస్థానం



క్వాలిటీ అస్యూరెన్స్ డైరెక్టర్ అజయ్‌ప్రకాష్ గుప్తాను సత్కరిస్తున్న వీసీ ప్రసాదరాజు

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): జేఎన్‌టీయూ కాకినాడ వర్సిటీలో ఉన్న ఫుడ్ టెస్టింగ్ పరిశోధన కేంద్రంలో ఆహార నాణ్యత పరీక్షలకు అగ్రస్థానం కల్పించడం సంతోషమని ఎఫ్ఎస్ఎస్ఏఐ క్వాలిటీ అస్యూరెన్స్ డైరెక్టర్ అజయ్ ప్రకాష్ గుప్తా పేర్కొన్నారు. ఆహార పరిశ్రమల నిర్వాహకులకు అందిస్తున్న సేవల గురించి రెండు రోజుల పాటు ఇంటరాక్టివ్ సెషన్ నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా గురువారం వీసీ సమావేశపు హాల్లో వర్సిటీ ఫుడ్ టెస్టింగ్ ల్యాబ్‌లో అందిస్తున్న సేవలపై సమీక్ష నిర్వహించారు. జేఎన్‌టీయూకే అధికారులు సాంకేతిక సంస్కరణలకు ప్రాధాన్యం ఇస్తూ అభివృద్ధిపై దృష్టి సారించడం సంతోషమని, మినిస్ట్రీ ఆఫ్ ఫుడ్ ప్రాసెసింగ్ ఇండస్ట్రీ, ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ ఆర్థిక సహకారంతో వర్సిటీలో ల్యాబ్ విజయవంతంగా నిర్వహిస్తున్నారన్నారు. వీసీ డాక్టర్ జీవీఆర్ ప్రసాదరాజు మాట్లాడుతూ అన్ని ఆహార పరిశ్రమలు, తయారీదారులు, వ్యాపారులకు తక్కువ ధరలకే నాణ్యత పరీక్షలు చేపడతామని, కాకినాడ పోర్టులో దిగుమతి చేసుకున్న ఆహార నమూనాలు పరీక్షించడం ద్వారా వర్సిటీ ల్యాబ్‌కు మరింత గుర్తింపు వచ్చిందన్నారు. రిజిస్ట్రార్ సుమలత మాట్లాడుతూ భవిష్యత్తులో ఫుడ్ టెక్నాలజీ విభాగం ద్వారా ఎగుమతి తనిఖీ మండలి, అగ్రికల్చర్ ఫుడ్ ఎక్స్‌పోర్ట్ వంటి అక్రిడిటేషన్లు పొందేందుకు కృషి చేస్తామన్నారు. ఫుడ్ టెక్నాలజీ విభాగాధిపతి డాక్టర్ మాలోతు రమేష్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఎఫ్ఎస్ఎస్ఏఐకి సంబంధించి ఫుడ్ సేఫ్టీ ట్రైనింగ్, సర్టిఫికేషన్ ఏకైక శిక్షణ భాగస్వామిగా ఉందన్నారు. పరిశ్రమలు, వీధి వ్యాపారులు ,రెస్టారెంట్లు, ఆహార పరిశ్రమ ఆపరేటర్లకు సర్టిఫికేషన్ ప్రోగ్రాం నిర్వహించేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. అనంతరం క్వాలిటీ అస్యూరెన్స్ డైరెక్టర్ డాక్టర్ అజయ్‌ప్రకాష్ గుప్తాను వీసీ ప్రసాదరాజు సత్కరించారు. కాకినాడ సీపోర్టు డైరెక్టర్ మురళీధర్, కస్టమ్స్ జాయింట్ కమిషనర్ నేరప్ప ఇరీనా పాల్గొన్నారు.

అక్రమ మద్యం పట్టివేత

ఈవీఎం స్ట్రోరేజ్ రూమ్‌లు, కౌంటింగ్ హాల్స్ పరిశీలన



ఈవీఎం స్ట్రోరేజ్ రూమ్‌లను తనిఖీ చేస్తున్న పోలీసు అబ్జర్వర్ చంద్రకాంత్, జిల్లా ఎస్పీ శ్రీధర్

అమలాపురం టౌన్: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో నిఘా బృందాలు అక్రమ మద్యం, నగదు రవాణాను అడ్డుకుంటున్నాయి. కాట్రేనికోన మండలం చెయ్యేరులోని శ్రీనివాస ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఈవీఎం స్ట్రోరేజ్ రూమ్‌లను, కౌంటింగ్ హాల్స్‌ను పోలీసు అబ్జర్వర్ ఎంపీ చంద్రకాంత్, జిల్లా ఎస్పీ సునరాపు శ్రీధర్ గురువారం పరిశీలించారు. అమలాపురం మండలంలోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను కూడా వీరు తనిఖీ చేశారు. జిల్లాలో నిఘా బృందాలు దాడులు, తనిఖీలు నిర్వహించి చేసిన అరెస్టులు, స్వాధీనం చేసుకున్న మద్యం, సారా వంటి వివరాలను జిల్లా ఎస్పీ కార్యాలయం గురువారం ఓ ప్రకటనలో తెలిపింది.

- జిల్లా నిఘా బృందాలు దాడులు చేసి అక్రమ మద్యం, సారా రవాణాపై 12 కేసులు నమోదు చేసి 12 మందిని అరెస్ట్ చేశారు. వారి నుంచి 9 నాన్ డ్యూటీ పెయిడ్ మద్యం సీసాలు, 41 డ్యూటీ పెయిడ్ మద్యం సీసాలు, 15.89 లీటర్ల ఇండియన్ మేడ్ లిక్కర్, 45 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు.
- ముమ్మిడివరం పోలీసు స్టేషన్ పరిధిలో అక్రమంగా తరలిస్తున్న రూ.36,808 విలువైన 430 లీటర్ల డీజిల్ ఆయిల్‌ను స్వాధీనం చేసుకున్నారు.
- ద్రాక్షారామ పోలీసు స్టేషన్ పరిధిలో ఏరుపల్లి, ఆదివారపుపేట గ్రామాల్లోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల ప్రాంతాల్లో స్థానిక పోలీసు అధికారులు కేంద్ర బలగాలతో కలసి గురువారం సాయంత్రం కవాతు నిర్వహించారు.
- మండపేట పట్టణంలోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను ఎలక్షన్ అబ్జర్వర్ ఐఏఎస్ అధికారి పరదీప్ కుమార్ తనిఖీ చేశారు.
- జిల్లాలో ఎన్నికల సందర్భంగా జొన్నాడ, గోపాలపురం, బొబ్బర్లంక, దిండి, ఎదుర్లంక, నరసాపురపుపేటల్లో ఏర్పాటు చేసిన జిల్లా సరిహద్దు చెక్ పోస్ట్‌ల్లో నిఘా బృందాలు గురువారం పలు వాహనాలు ఆపి విస్తృత తనిఖీలు చేశాయి.

చోరీ కేసులో ఏడాది జైలు

కె.గంగవరం: మండలంలోని సత్యవాడ గ్రామంలో గత ఏడాది చోటు చేసుకున్న చోరీ కేసులో నిందితులకు ఏడాది జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు ఇచ్చినట్టు కె.గంగవరం ఎస్సై ఎస్‌కే జానీ బాషా గురువారం విలేకరులకు తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. 2023 నవంబర్ 30న మండలంలోని సత్యవాడ గ్రామంలో రామేశ్వరపు వీరవెంకట సత్యనారాయణ కుటుంబం ఇంటిలో లేని సమయంలో బంగారు, వెండి వస్తువులను గుర్తు తెలియని వ్యక్తులు దోచుకుపోయారు. ఎస్సై జానీబాషా కేసును దర్యాప్తు చేసి ముద్దాయిలను కోర్టులో హాజరు పరిచారు. ఏపీపీ బి.రామతులసి వాదనలతో నిందితులు పిల్లి సురేష్, ఉండి శివ సుబ్రహ్మణ్యం, బొగడ శ్రీనులపై నేరం రుజువు కావడంతో రామచంద్రపురం జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ జస్టిస్ వి.నాగేశ్వరరావు నాయక్ ఒక్కొక్కరికీ ఏడాది జైలు శిక్ష విధిస్తూ తీర్పు ఇచ్చారు. తక్కువ సమయంలో కేసును ఛేదించి నేరస్తులకు శిక్ష వేయించిన ఎస్సై జానీబాషా, ఏఎస్సై రాంబాబు, సిబ్బంది లక్ష్మణ్, కామేశ్, ఛాయారత్నంలను ఎస్పీ ఎస్.శ్రీధర్, డీఎస్పీ బి.రామకృష్ణ, సీఐ పి.దొరరాజు అభినందించారు.

'నన్నయ'లో పీజీ కొత్త కోర్సు ప్రారంభం

- ఏపీ పీజీ సెట్ ద్వారా ప్రవేశాలు
- కోర్సు పూర్తి చేస్తే ఉద్యోగావకాశాలు మెండు

రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీలో ఎంఎస్సీ జియోఇన్ఫర్మేటిక్స్ కోర్సును నూతనంగా ప్రారంభిస్తున్నారు. కంప్యూటర్ సైన్స్, జియాలజీ, జియోగ్రఫీ, లైఫ్ సైన్సెస్, ఎన్విరాన్‌మెంటల్ సైన్సెస్, అగ్రికల్చర్ సైన్సెస్, ఫిజిక్స్, మ్యాథమెటిక్స్, కెమిస్ట్రీ, ఎలక్ట్రానిక్స్‌లలో ఏవైనా రెండు సబ్జెక్టులతో కోర్సు పూర్తి చేసిన సైన్స్ గ్రాడ్యుయేట్లు ఈ నూతన కోర్సులో చేరేందుకు అర్హులు. ఏపీ పీజీ సెట్ ద్వారా మాత్రమే ఈ కోర్సులో చేరేందుకు అవకాశం ఉంటుంది. ఆసక్తి, అర్హత ఉన్న వారు ఈ నెల 4వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవచ్చు. కోర్సులో చేరిన విద్యార్థులకు స్కాలర్ షిప్, ఫెలోషిప్‌లు లభిస్తాయి. జియో ఇన్ఫర్మేటిక్స్ చేసిన విద్యార్థులకు పరిశోధనల్లోను, ఉద్యోగ, ఉపాధిలోను అవకాశాలు మెండుగా ఉంటాయి. ఇస్రో, ఎన్.ఆర్.ఎస్.సి., ఎన్.బి.ఎస్.ఎస్., ఎస్.ఎస్.డి.ఐ., ఎఫ్.ఎస్.ఐ., జి.ఎస్.ఐ., డి.ఆర్.డి.ఓ., ఎన్.ఐ.ఆర్.డి. వంటి ప్రభుత్వ సంస్థల్లో ఉద్యోగాలు పొందడానికి అవకాశం ఉంటుంది. యాక్సెంచర్, భారతీ ఎయిర్‌టెల్, కాగ్నిజెంట్ టెక్నాలజీ, సైయింట్, జెనెసిస్ ఇంటర్నేషనల్, గూగుల్, ఇన్ఫోసిస్, బిపిఎం., టీసీఎస్., టెక్ మహీంద్రా, ట్రింబుల్ మ్యాప్‌లు, విప్రో వంటి సంస్థల్లోనూ ఉద్యోగాలు అందుకోవచ్చు.

అర్హత, ఆసక్తి ఉన్నవారు దరఖాస్తు చేసుకోవచ్చు



'నన్నయ' వర్సిటీలో నూతనంగా ప్రారంభిస్తున్న ఎంఎస్సీ జియోఇన్ఫర్మేటిక్స్ కోర్సులో చేరేందుకు ఆసక్తి ఉన్న వారు శనివారంలోగా దరఖాస్తు చేసుకోవాలి. ఏపీ పీజీ సెట్ రాసిన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవచ్చు. కోర్సులో చేరిన విద్యార్థులకు స్కాలర్‌షిప్, ఫెలోషిప్‌లు లభిస్తాయి. ప్రభుత్వ, ప్రైవేట్ రంగ సంస్థలలో ఉద్యోగావకాశాలకు కొదవుండదు. పూర్తి వివరాలకు యూనివర్సిటీ వెబ్‌సైట్‌ని చూడవచ్చు.

– ఉపకులపతి ఆచార్య కె.పద్మరాజు, ఆదికవి నన్నయ యూనివర్సిటీ



ఆదికవి నన్నయ యూనివర్సిటీ

ఇంత బాగా నేర్చుకుంటానని అనుకోలేదు



ఇంగ్లిషు చదవడం అంటే కష్టంగా ఉండేది. పరీక్షల్లో పాసవ్వాలనే పట్టుదలతో ఇంగ్లిషు చదివే దానిని. కాని రైజ్ ప్రోగ్రాం ద్వారా మా స్కూల్లో ప్రసాద్ మాస్టారు తక్కువ సమయంలోనే అనర్గళంగా ఇంగ్లిషు మాట్లాడడం నేర్పించారు. ఇంగ్లిషు మాట్లాడడం ఒక ఎత్తైతే, వేరే దేశం ఉచ్ఛారణలో మాట్లాడడం మరో ఎత్తు . ప్రస్తుతం ఇటలీ యాసలో మాట్లడడం నేర్చుకున్నాను. మాక్ జీ- 20 జిల్లా సదస్సులో ఇటలీ ప్రతినిధిగా ఎంపికయ్యాను.

– గంటా లక్ష్మీప్రసన్న, టెన్త్ విద్యార్థిని, కేపీఎం ప్రభుత్వ స్కూల్, పిఠాపురం

పేదల కలను జగన్ మామ నిజం చేశారు



నేను పి. దొంతమూరు జెడ్పీ హైస్కూల్లో 9వ తరగతి విద్యార్థిని. మా నాన్న కిరాణా వ్యాపారి. ఇంగ్లిషు మీడియంలో చదివించాలనే ఆసక్తి ఉన్నా స్థోమత లేక ప్రభుత్వ బడిలో చేర్పించారు. ఇంగ్లిషు మీడియం స్కూల్లో చదువుకున్న వారిని చూస్తే మాకు కూడా ఇలా నేర్పితే బాగుండును అనుకునే దానిని. సీఎం వైఎస్ జగన్ మావయ్య ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిషు విద్యను ప్రవేశ పెట్టి అమలు చేయడంతో మాకు ఈ అవకాశం వచ్చింది. స్వల్ప కాలంలోనే ఇంగ్లిషును అనర్గళంగా మాట్లాడే స్థాయికి చేరుకున్నాం. జీ- 20 జిల్లా సదస్సుకు ఫ్రాన్స్ ప్రతినిధిగా ఎంపికయ్యాను.

– కోశెట్టి శశి నాగ, 9వ తరగతి విద్యార్థిని, పిదొంతమూరు, పిఠాపురం మండలం

చేపలు విక్రయించే ఇంట ఇంగ్లిష్ చదువు



మాది పిఠాపురం మండలం పి.దొంతమూరు. మా గ్రామంలోని జెడ్పీ హైస్కూల్లో 9వ తరగతి చదువుతున్నాను. నాన్న చేపల వ్యాపారి. మా గ్రామంలోని సంపన్నుల పిల్లలు ప్రైవేట్ స్కూళ్లలో చదువుతూ ఇంగ్లిషులో మాట్లాడుతుంటే నేను అలా మాట్లాడగలిగితే బాగుండును అనిపించేది. అనుకోకుండా సీఎం వైఎస్ జగన్ మావయ్య ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిషు విద్య ప్రవేశ పెట్టి అమలు చేస్తుండడంతో నాకూ ఈ అవకాశం వచ్చింది. తక్కువ సమయంలో ఇంగ్లిషు బాగా నేర్చుకున్నాను. నా ఇంగ్లిషు మాట తీరు చూసి మా నాన్న ఇందతా సీఎం వైఎస్ జగన్ చలువే అంటూ మురిసిపోతున్నారు.

–సిమ్మా వీర దుర్గ, 9వ తరగతి విద్యార్థిని, పి దొంతమూరు, పిఠాపురం మండలం

రైజింగ్ ఇంగ్లిష్



బెండపూడిలో విద్యార్థినులను అభినందిస్తున్న ఆస్ట్రేలియా ఉపాధ్యాయురాలు

- విదేశీ ఆంగ్లంలో చక్కగా మాట్లాడుతున్న ప్రభుత్వ స్కూళ్ల విద్యార్థులు
- రైజ్ ప్రోగ్రాంలో ఇంగ్లిష్‌లో ఆరితేరుతున్న చిన్నారులు
- 12 వేలకు పైగా విద్యార్థులకు శిక్షణ
- ఇదంతా సీఎం జగన్ ప్రవేశ పెట్టిన ఇంగ్లిష్ మీడియం చలవే
- విదేశీ ఉపాధ్యాయుల నుంచి అభినందనలు

పిఠాపురం: అది కాకినాడ జిల్లా అన్నవరానికి సమీపంలోని బెండపూడి గ్రామం. ఆ చిన్న ఊరిలో జిల్లా పరిషత్ హైస్కూల్ ఇటీవల వార్తల్లోకెక్కింది. ఇక్కడ చదువుతున్న విద్యార్థులు అమెరికన్ యాక్సెంట్‌లో ఇంగ్లిషును అనర్గళంగా మాట్లాడడమే దానికి కారణం. చదువులో ఒకప్పుడు తుని నియోజకవర్గ పాఠశాలలు వెనుకబడి ఉండేవి. అలాంటి పాఠశాలల విద్యార్థులు ఇప్పుడు చదువులో తమను మించిన వారు లేరని చెప్పుకునే స్థాయికి ఎదిగారు. ఇంగ్లిషులోనూ తామెవరికీ తీసిపోమని నిరూపించుకున్నారు. గతంలో చెప్పుకోవడానికే సిగ్గుపడేలా ఉండే రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలు 2019 తర్వాత ప్రపంచ దేశాలను ఆకర్షిస్తున్నాయి. విదేశీ ప్రతినిధుల ప్రశంసలు సైతం అందుకుంటున్నాయి. ఏదేశ యాసలో అయినా తాము ఇంగ్లిషు మాట్లాడగలమని గర్వంగా చెబుతున్నారు ఇక్కడి విద్యార్థులు. దీనంతటికీ కారణం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యా వ్యవస్థలో తీసుకువచ్చిన సంస్కరణలే. బెండపూడి జెడ్పీ హైస్కూల్ ఇంగ్లిషు టీచర్ ప్రసాద్ చేసిన ప్రయోగంతో ఆ విద్యార్థులు ఆంగ్లంపై పట్టు సాధించారు. మాతృభాష తప్ప అన్య భాషలను ఎప్పుడు వినని, మాట్లాడని భాషను వారు అనర్గళంగా మాట్లాడడం ఆ పాఠశాలను ప్రపంచ దేశాలకు పరిచయం చేసింది. ఈ పాఠశాల విద్యార్థుల ప్రతిభను గుర్తించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వారిని తన కార్యాలయానికి ఆహ్వానించి అభినందించారు.

కార్పొరేట్‌కు దీటుగా..

కొందరు గురుకుల పాఠశాలల విద్యార్థులు ఐక్యరాజ్య సమితిలో ప్రసంగించి వచ్చారు. ఇప్పటికే ఆంగ్ల భాషను అనర్గళంగా మాట్లాడి శభాష్ అనిపించుకున్న బెండపూడి విద్యార్థులను మించి ఈ జిల్లాలోని మరికొన్ని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు వివిధ దేశాల భాషలను అనర్గళంగా మాట్లాడి ఔరా! అనిపించారు. అంతేగాకుండా ఇటీవల భారత్‌లో జరిగిన జీ -20 దేశాల సమావేశాన్ని ఈ విద్యార్థులు మాక్ జీ- 20గా నిర్వహించి అందరి ప్రశంసలూ పొందారు. కార్పొరేట్ పాఠశాలల విద్యార్థులు సైతం వీరి ప్రతిభను చూసి నేర్చుకుంటున్నారు. అంటే ప్రభుత్వ పాఠశాలల ఉన్నతి కార్పొరేట్ విద్యాసంస్థల స్థాయిని మించి పోయిందని ఇక్కడి విద్యార్థులు నిరూపించారు. పేదవాడికి నాణ్యమైన ఇంగ్లిషు అందించాలనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయాన్ని అనతి కాలంలోనే నిజం చేస్తున్నారు వారు.



తరగతి గదిలో ఇంగ్లిషు పాఠాలు నేర్పుతున్న ఉపాధ్యాయుడు ప్రసాద్

రైజ్ ప్రోగ్రాంలో శిక్షణ

రీడ్ నెస్ ఇన్నోవేటివ్ ఫర్ సిట్యుయేషనల్ ఇంగ్లిషు రైజ్ అనే ప్రోగ్రాంతో జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిషు భాషపై ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. సీఎం వైస్ జగన్ ఆదేశాల మేరకు జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా ప్రత్యేక శ్రద్ధతో జిల్లా అంతా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఇంగ్లిషుపై ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. బెండపూడి విద్యార్థులతో మమేకమైన సీఎం వైఎస్ జగన్ ఆదేశాల మేరకు తొలుత ఎన్టీఆర్ జిల్లా నిడమాలూరు ప్రభుత్వ పాఠశాల్లో 12 రోజుల పాటు పైలెట్ ప్రాజెక్టుగా 2022 మేలో వేసవి శిక్షణ శిబిరం నిర్వహించారు. ఇక్కడ 100 మంది విద్యార్థులకు ఇంగ్లిషు భాషపై ప్రత్యేక తరగతులు నిర్వహించారు. కేవలం 12 రోజుల్లోనే అక్కడి విద్యార్థులు ఇంగ్లిషులో మంచి ప్రావీణ్యం సాధించారు. దీనిని స్ఫూర్తిగా తీసుకున్ని ఉన్నతాధికారులు రాష్ట్రమంతా రైజ్ కార్యక్రమాలకు రూపకల్పన చేశారు. దీంతో కాకినాడ జిల్లాలో వెనుకబడి ఉన్న తుని నియోజకవర్గంలో పైలెట్ ప్రాజెక్టుగా విద్యార్థులకు ఆంగ్లంలో ప్రత్యేక శిక్షణ ప్రారంభించారు. అక్కడ విజయవంతం కావడంతో కాకినాడ అర్బన్, జగ్గంపేట, పిఠాపురం, పెద్దాపురం నియోజకవర్గాలకు ప్రస్తుతం విస్తరించారు.

45 రోజుల్లోనే అనర్గళంగా..

ఒక్కో జెడ్పీ హైస్కూల్ నుంచి 30 మంది చొప్పున విద్యార్థులను ఎంపిక చేసి, వారికి ఇంగ్లిషులో ప్రత్యే శిక్షణ ప్రారంభించారు. ప్రతి నియోజకవర్గంలోనూ 45 పని వేళల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఆ స్వల్ప కాలంలోనే విద్యార్థులకు ఎలాంటి పరిస్థితుల్లో అయినా ఇంగ్లిషు మాట్లడ గలిగేలా శిక్షణ ఇస్తున్నారు.

నియోజకవర్గాల వారీగా

తునిలో	1020 మంది
కాకినాడ అర్బన్‌లో	2800 మంది
పిఠాపురంలో	1490 మంది
జగ్గంపేటలో	1990 మంది
పెద్దాపురంలో	3745 మంది
ఇప్పటి వరకూ ఆంగ్లంలో పట్టు సాధించిన ప్రభుత్వ విద్యార్థులు	12,195 మంది



జీ -20 సదస్సు నిర్వహించిన ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు

ఇది నిజంగా మిరాకిల్



మారుమూల గ్రామాల ప్రభుత్వ స్కూళ్ల విద్యార్థులు ఇలా అమెరికన్ లాంగ్వేజ్ మాట్లాడడం నిజంగా మిరాకిల్. తూర్పుగోదావరి జిల్లా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల వీడియోలను సోషల్ మీడియాలో చూసి ఎంత వరకూ నిజమో తెలుసుకోవాలని ఇక్కడకు వచ్చాను. తీరా చూస్తే నమ్మలేని నిజమని రుజువైంది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కృషి నిజంగా అభినందనీయం.

– వివియాన్, ఉపాధ్యాయురాలు, ఆస్ట్రేలియా

సీఎం జగన్ ప్రోత్సాహమే కారణం



తక్కువ సమయంలో విద్యార్థులు ఆయా దేశాల భాషలను అనుసరిస్తూ ఇంగ్లిషులో అనర్గళంగా మాట్లాడడం ఆంగ్ల ప్రొఫెసర్లనే ఆశ్చర్యపరిచింది. అంతర్జాతీయ అంశాలపైనా విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నాం. గ్లోబల్ ఇంటరాక్టివ్ ప్యానల్స్ ద్వారా డిజిటల్ టచ్ స్క్రీన్‌పై పాఠాలు బోధించే ప్రభుత్వంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ప్రపంచంలోనే ప్రథమ స్థానంలో ఉంది. ఇదంతా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యా వ్యవస్థలో తీసుకు వచ్చిన సంస్కరణల వల్లే సాధ్యమైంది. రైజ్ ప్రోగ్రాం ద్వారా ఇప్పటికే కాకినాడ జిల్లాలోని పలు నియోజకవర్గాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిషు నేర్పిస్తున్నాం.

– జీవీ ప్రసాద్, రైజ్ కో-ఆర్డినేటర్, కాకినాడ జిల్లా

స్వతంత్రులకు పట్టం కట్టని కొత్తపేట



ముత్యాల సుబ్బారాయుడు



ఎంపీఎస్ సుబ్బరాజు



డాక్టర్ చిర్ల సోమసుందరరెడ్డి

కొత్తపేట: కొత్తపేట అసెంబ్లీ నియోజకవర్గ ఓటర్లు స్వతంత్ర అభ్యర్థులకు ఎప్పుడూ పట్టం కట్టలేదు. 1962, 1967 ఎన్నిక ల్లో ముత్యాల సుబ్బారాయుడు కాంగ్రెస్ అభ్యర్థిపై 1,542 ఓట్లు, 3,143 ఓట్ల తేడాతో ఓటమి చెందారు. 1972లో ఎంపీఎస్ సుబ్బరాజు కాంగ్రెస్ అభ్యర్థి భానుతిలకంతో తలపడి 9,829 ఓట్ల తేడాతో ఓడారు. డాక్టర్ చిర్ల సోమసుందరరెడ్డి 1985, 1999 ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థులు డాక్టర్ ఐఎస్ రాజు, బండారు సత్యానందరావుతో తలపడి 1,397, 16,113 ఓట్ల తేడాతో ప్రత్యర్థిగా నిలిచి సత్తా చాటుకున్నారు.

చెక్‌పోస్టు తనిఖీ చేసిన కలెక్టర్



చెక్‌పోస్టు వద్ద రిజిస్టర్లను పరిశీలిస్తున్న కలెక్టర్ నివాస్

ప్రత్తిపాడు: పదహారో నంబర్ జాతీయ రహదారిపై కాకినాడ జిల్లా ప్రత్తిపాడు వద్ద అటవీ శాఖ ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ జె.నివాస్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇప్పటి వరకూ స్టాటిక్ సర్వైలెన్స్ బృందం చేసిన తనిఖీలు, నమోదు చేసిన రిజిస్టర్లను తనిఖీ చేసి, కేసుల వివరాలు ఆరా తీశారు. జాతీయ రహదారిపై వాహనాలను ఏవిధంగా తనిఖీ చేస్తున్నారో పరిశీలించారు. స్టాటిక్ సర్వైలెన్స్ టీము అధికారులకు కలెక్టర్ పలు సూచనలిచ్చారు. కార్యక్రమంలో ప్రత్తిపాడు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎ.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



ఉప్పలగుప్తం మండలం ఎస్.యానంలోని రవ్వ క్షేత్రం

నియోజకవర్గ అమలాపురం ముఖచిత్రం



ఆక్వా చెరువులు

నిక్షేపాల గని... ఆక్వా సిరి

- అభివృద్ధి దిశగా అమలాపురంలో శరవేగంగా అడుగులు
- డీ లిమిటేషన్‌లో జనరల్ నుంచి ఎస్సీ రిజర్వుడుగా మారిన నియోజకవర్గం
- స్వతంత్రులుగా సత్తా చాటిన ఐదుగురు ఉద్దండులు

అమలాపురం టౌన్: దాదాపు వందేళ్ల క్రితం బ్రిటీష్ హయాంలో ఉండగా చిందాడమడుగు వద్ద వెలిసిన అమలేశ్వర దేవాలయం విశిష్టతతో అమలాపురం పేరు సార్ధకమైందని ఓ నానుడి. అమలాపురం పూర్వనామం అమృతపురి అనీ, కాలక్రమేణా అది కాస్తా అమ్లీపురిగా, అమలాపురంగా మారిందని చెబుతారు. అమలాపురంలో ఉన్న అమలేశ్వర స్వామి, సిద్ధేశ్వరస్వామి, మల్లేశ్వరస్వామి, రామ లింగేశ్వరస్వామి, చంద్రమౌళీశ్వరస్వామి ఆలయాల వల్ల ఈ ఊరు పంచలింగాపురంగానూ పిలవబడేది. 1952లో ద్విసభ్య నియోజకవర్గంగా ఆవిర్భవించిన అమలాపురం నియోజకవర్గం 1955 తర్వాత ఒకే శాసనసభ నియోజకవర్గంగా రూపాంతరం చెందింది. 1952 నుంచి 1955 మధ్యలో నలుగురు ఎమ్మెల్యేలు నియోజకవర్గాన్ని ఏలారు.

నియోజకవర్గ స్వరూపం

తొలుత పంచాయతీగా ఉన్న అమలాపురం 1948లో మున్సిపాలిటీగా, అనంతరం నియోజకవర్గ కేంద్రంగా రూపాంతరం చెందింది. అమలాపురం నియోజకవర్గం ఆవిర్భావం నుంచి జనరల్ కేటగిరీలో ఉండేది. అయితే 2009లో జరిగిన నియోజకవర్గాల పునర్విభజన(డీ లిమిటేషన్)లో ఈ నియోజకవర్గం ఎస్సీ రిజర్వుడు అయింది. జనరల్ కేటగిరీలో ఉన్నప్పుడు నియోజకవర్గంలో అమలాపురం పట్టణంతో పాటు అయినవిల్లి మండలం, అమలాపురం రూరల్ మండలం, అంబాజీపేట మండలంలోని మెజార్టీ గ్రామాలతో ఇమిడి ఉండేది. పునర్విభజన తర్వాత అమలాపురం పట్టణంతో పాటు అమలాపురం రూరల్, అల్లవరం, ఉప్పలగుప్తం మండల్లాలోని 60 గ్రామాలతో ఎస్సీ నియోజకర్గంగా రూపాంతరం చెందింది. నియోజకవర్గానికి ఓ పక్క పి.గన్నవరం నియోజకవర్గం, మరో పక్క ముమ్మిడివరం నియోజకవర్గం సరిహద్దులుగా ఉన్నాయి. సముద్ర తీరంతో పాటు వైనతేయ నదీ పాయలతో నియోజకవర్గం విస్తరించి ఉంది. నియోజకవర్గంలో కొబ్బరి తోటలు, వరి చేలు, అరటి తోటలతో పాటు ఆక్వా సాగు అధికంగా ఉంది.



అమలాపురం పట్టణం

ఐదుగురు స్వతంత్రులను గెలిపించిన నియోజకవర్గం

నియోజకవర్గం ఏర్పడిన 1952 నుంచి ఇప్పటి వరకూ 16 పర్యాయాలు జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఐదుసార్లు స్వతంత్రులే సత్తా చాటి ఎమ్మెల్యేలు అయ్యారు. 1955లో ద్విసభ్య ఎన్నికల్లో జి.నరసింహమూర్తి, బి.అప్పలస్వామిలు ఇద్దరూ స్వతంత్ర అభ్యర్థులుగా విజయ బావుటా ఎగురవేశారు. 1962 ఎన్నికల్లో కుడుపూడి సూర్యనారాయణ, 1967 ఎన్నికల్లో కుడుపూడి ప్రభాకరరావు, 2004 ఎన్నికల్లో కుడుపూడి చిట్టబ్బాయి స్వతంత్ర అభ్యర్థులుగా నిలబడి ఎమ్మెల్యేలుగా గెలిచారు. ఈ నియోజకవర్గం నుంచి 1989 ఎన్నికల్లో గెలిచిన ఎమ్మెల్యే కుడుపూడి ప్రభాకరరావు(కాంగ్రెస్), 1999 ఎన్నికల్లో గెలిచిన డాక్టర్ మెట్ల సత్యనారాయణరావు(టీడీపీ)లు రాష్ట్ర మంత్రులుగా పనిచేశారు. తర్వాత 2009, 2019 ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలిచిన పినిపే విశ్వరూప్(కాంగ్రెస్, వైఎస్సార్ సీపీ) రాష్ట్ర మంత్రిగా పనిచేశారు. ప్రస్తుతం రాష్ట్ర రవాణా శాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. నియోజకవర్గ ఆవిర్భావంలో 1952లో ద్విసభ్య నియోజకవర్గం నుంచి నడింపల్లి రామభద్రరాజు (కేఎంపీపీ), బొజ్జా అప్పలస్వామి(ఎస్‌సీఎఫ్) ఎమ్మెల్యేలుగా గెలిచారు. 1952, 1955లో జరిగిన ద్విసభ్య ఎన్నికల్లో బి.అప్పలస్వామి రెండుసార్లు వరుసగా గెలిచారు. అలాగే నడింపల్లి రామభద్రరాజు 1952 సంవత్సరం ద్విసభ్య ఎన్నికల్లో ఓసారి, 1965లో జరిగిన ఉప ఎన్నికల్లో మరోసారి ఎమ్మెల్యేగా గెలిచారు. 1967, 1972, 1985, 1989 ఎన్నికల్లో నియోజకవర్గం నుంచి నాలుగు సార్లు అంటే ఓసారి స్వతంత్రుడిగా మూడు పర్యాయాలు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా కుడుపూడి ప్రభాకరావు గెలిచారు. 1983 1994, 1999 ఎన్నికల్లో డాక్టర్ మెట్ల సత్యనారాయణరావు టీడీపీ నుంచి ఎమ్మెల్యేగా గెలిచారు. 2009, 2019 ఎన్నికల్లో పినిపే విశ్వరూప్ రెండుసార్లు ఎమ్మెల్యే గెలిచారు. మిగిలిన ఐదుగురు అసెంబ్లీ ఎన్నికల్లో ఒకేసారి ఎమ్మెల్యేలుగా పనిచేశారు.



నియోజకవర్గ ల్యాండ్ మార్కు అమలాపురం గడియారం స్తంభం

అమలాపురం నియోజకవర్గంలో జూన్ 2019 నుంచి 2023 సంవత్సరాంతం వరకూ వివిధ పథకాల ద్వారా లబ్ధి

పథకం	లబ్ధిదారులు	లబ్ధి(రూ.కోట్లలో)	పథకం	లబ్ధిదారులు	లబ్ధి(రూ.కోట్లలో)
వైఎస్సార్ పెన్షన్ కానుక	34,617	377.89	వైఎస్సార్ బీమా క్లెయిమ్	169	5.25
జగనన్న అమ్మ ఒడి	19,225	21.14	వైఎస్సార్ కాపు నేస్తం	5,514	23.13
జగనన్న వసతి దీవెన	5,974	23.66	వైఎస్సార్ నేత నేస్తం	982	9.01
జగనన్న విద్యా దీవెన	6,934	45.05	జగనన్న చేదోడు	24,763	10.62
వైఎస్సార్ రైతు భరోసా	15,573	86.53	వైఎస్సార్ వాహన మిత్ర	1103	4.45
వైఎస్సార్ రైతు సున్నా వడ్డీ	3,491	10.07	అర్చకులు, పాస్టర్లు, ఇమామ్, మౌజమ్‌లు	77	0.88
వైఎస్సార్ ఉచిత పంటల బీమా	9,482	17.19	వైఎస్సార్ పంటల బీమా	1792	3.04
రైతులు ఇన్‌పుట్ సబ్సిడీ	733	2.24	వైఎస్సార్ పశు నష్ట బీమా పథకం	105	3.98
వైఎస్సార్ సున్నా వడ్డీ(మహిళా సంఘాలు)	59,240	21.03	వైఎస్సార్ ఆరోగ్య ఆసరా	921	3.74
వైఎస్సార్ చేయూత	20,500	59.21	ఆరోగ్యశ్రీ	907	3.77
వైఎస్సార్ ఆసరా	32,269	109.37	మొత్తం	2,49,769	812.47

నియోజకవర్గ సమాచారం

పోలింగ్ కేంద్రాలు	-235
మున్సిపాలిటీ	- 1
గ్రామాలు	-60
సచివాలయాలు	-84
రైతు భరోసా కేంద్రాలు	- 58
ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి (100 పడకలు)	- 1
ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు	- 7
అర్బన్ హెల్త్ సెంటర్లు	- 2
వెటర్నరీ ఆస్పత్రులు	-10

ఓటర్ల వివరాలు

1952 ద్విసభ్య నియోజకవర్గంలో 3,28,430 మంది ఓటర్లు ఉండగా 1962 నుంచి ఏర్పడ్డ ఒకే నియోజకవర్గానికి వచ్చే సరికి 65,678 మంది ఓటర్లు ఉన్నారు. ప్రస్తుతం నియోజకవర్గంలో 2,06,383 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో పురుషులు 1,03,228 మంది, మహిళలు 1.08.115 మంది ఉన్నారు.

నియోజకవర్గ ప్రత్యేకతలు

- అమలాపురం పట్టణం గతంలో రెవెన్యూ(కోనసీమ) డివిజన్ కేంద్రంగా ఉంది. 2022లో జిల్లాల పునర్విభజనలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా విడిపోయాక అమలాపురం జిల్లా కేంద్రమైంది. నాటి నుంచి అమలాపురంతో పాటు నియోజకవర్గంలో అభివృద్ధి దిశగా శరవేగంగా అడుగులు పడుతున్నాయి. గత ఐదేళ్లలో దాదాపు రూ.600 కోట్లకు పైగా అభివృద్ధి పనులు సొంతమయ్యాయి.
- నియోజకర్గంలోని అల్లవరం మండలం ఓడలరేవులో సముద్ర తీరాన చమురు సంస్థ ఓఎన్జీసీ ఆఫ్ షోర్, ఆన్ షోర్ టెర్మినల్స్ ఉన్నాయి. ఆఫ్ షోర్ (సముద్ర గర్భం)లో దాదాపు 18కి పైగా బావులు ఉన్నాయి. అలాగే ఉప్పలగుప్తం మండలం ఎస్.యానాంలో కెయిర్న్ ఎనర్జీ, వేదాంత సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో చమురు క్షేత్రం ఉంది. ఈ చమురు క్షేత్రాల ద్వారా అపారమైన చమురు ఉప్పత్తి అవుతోంది.
- నియోజకవర్గంలో దాదాపు 22 వేల ఎకరాల్లో ఆక్వా సాగవుతోంది. కొబ్బరి, వరి, అరటి పంటలకు దీటుగా ఆక్వా సాగు తన సత్తాను చాటుతోంది. రొయ్యలు, చేపల ఉత్పత్తిలో నియోజకవర్గం తనదైన ముద్రతో ముందుకు సాగుతోంది.
- అల్లవరం మండలం ఓడలరేవు సముద్ర తీరం పర్యాటకులతో బీచ్‌గా అభివృద్ధి చెందుతోంది. సాధారణ రోజుల్లోనే కాకుండా కార్తిక మాసంలో పర్యాటకుల సందడి అధికంగా ఉంటుంది.
- నియోజకవర్గంలో ఓ ప్రైవేటు మెడికల్ కళాశాల, కార్పొరేట్ ఆస్పత్రి ఉంది. దీనికి తోడు ప్రభుత్వం 50 ఎకరాల విస్తీర్ణంలో రూ.500 కోట్ల వ్యయంతో కొత్తగా మెడికల్ కళాశాల, బోధనా ఆస్పత్రిని శరవేగంగా నిర్మిస్తోంది. ఇవి కాకుండా రెండు ఇంజినీరింగ్ కళాశాలలతో సాంకేతిక విద్యా కేంద్రంగా నియోజకవర్గం వృద్ధి చెందుతోంది.